క్లుప్తంగా

అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షునిగా రంగారావు



రంగారావును అభినందిస్తున్న సంఘ సభ్యులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షునిగా టీవీఎస్ రంగారావు ఎన్నికయ్యారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంఘం సర్వసభ్య సమావేశం కార్యదర్శి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన శనివారం జరిగింది. ఇటీవల మరణించిన అధ్యక్షుడు డాక్టర్ కె.స్వర్ణరాజు స్థానంలో నూతన అధ్యక్షుడిని సభ్యులు ఎన్నుకున్నారు. సంఘ సీనియర్ సభ్యుడు, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘ ఈసీ సభ్యుడు అయిన రంగారావును అధ్యక్షునిగా సుబ్రహ్మణ్యం ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ సంఘ ప్రతినిధులు కొండలరావు, పీడీలు గిరి, ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ వర్మ తదితరులు పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడు రంగారావుకు అభినందనలు తెలిపారు.

జేపీఎఫ్ అధ్యక్షునిగా రఘుయేలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జగన్నాథపురం పాస్టర్స్ ఫెలోషిప్ (జేపీఎఫ్) అధ్యక్షునిగా ఎస్.రఘుయేలు ఎన్నియ్యారు. గోలీపేటలోని ఎన్‌టీసీ పెంతుకోస్టల్ చర్చిలో జేపీఎఫ్ ఎన్నికలు అధ్యక్షుడు ఎం.దానియేలు అధ్యక్షతన శనివారం జరిగాయి. రఘుయేలు అధ్యక్షునిగా, కె.జాన్‌ప్రసాద్ కార్యదర్శిగా, ఎంపీఎస్ రాజు కోశాధికారిగా ఎన్నికయ్యారు. సభ్యుల సహకారంతో తన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని రఘుయేలు అన్నారు.

17న జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం

కాకినాడ సిటీ: జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పాల్గొంటారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని జెడ్పీ వర్గాలు కోరాయి.

అడ్‌హాక్ కమిటీ ఎన్నిక



అడ్‌హాక్ కమిటీని అభినందిస్తున్న రాష్ట్ర నాయకులు

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అడ్‌హాక్ కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు ప్రకటించారు. కాకినాడ రెవెన్యూ అసోసియేషన్ భవనంలో శనివారం జరిగిన సమావేశంలో అడహాక్ కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సవరపు చిన పాపారావు, కన్వీనర్‌గా ఖండవల్లి చంద్రశేఖర్, కోశాధికారిగా కొప్పిశెట్టి కృష్ణ, సభ్యులుగా జోసఫ్ మార్సివన్, వాసంశెట్టి దుర్గాప్రసాద్, వుద్దవోలు కృష్ణంరాజు, ఆర్.రవి, కురవాడ దుర్గాప్రసాద్, గోపి, షేక్ ముంతాజ్ బేగం, ఆర్.ఏసుబాబు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా టీవీ ఫణి పేర్రాజు, ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ పితాని త్రినాథ్, ఏపీ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొని, అడ్‌హాక్ కమిటీ సభ్యులను అభినందించారు.

కేబుల్ ఆపరేటర్ల వ్యవస్థను బతికించాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కేబుల్ పరిశ్రమను ప్రభుత్వం గుర్తించి, ఆపరేటర్ల వ్యవస్థను బతికించాలని డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ ఫెడరేషన్ జాయింట్ కార్యదర్శి బండారు కృష్ణమూర్తి కోరారు. కేబుల్ ఆపరేటర్లకు లైసెన్స్ ఇచ్చే విధంగా కేంద్ర ప్రసార శాఖ చర్యలు చేపడుతున్న నేపథ్యంలో జేఎన్‌టీయూకేలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేబుల్ ఆపరేటర్ల ఇబ్బందులు తొలగించాలని, ముద్ర రుణాలు మంజూరు చేయాలని, పోల్ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్‌ను ఇటీవల కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. సమావేశంలో సభ్యులు సీతారామయ్య, కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మీసాల వెంకన్నకు ప్రత్యేక పూజలు

కరప: యండమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు పెద్దింటి సీతారామం శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మీసాల వేంకటేశ్వరునిగా పిలిచే ఈ స్వామివారిని ఏడు వారాలు దర్శించి, ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కుకుంటే కోరికలు తీరుతాయని సీతారామం తెలిపారు. స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేళంగి, పెదకొత్తూరు గ్రామాల వారు ఇచ్చిన విరాళాలతో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

గురజనాపల్లిలో బాబుతో నేను

కరప: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు దారుణమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు. గురజనాపల్లిలో శనివారం ఆమె బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కరుణించవమ్మా.. కాపాడవమ్మా..

- నేటి నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు
- ముస్తాబైన అమ్మవార్ల ఆలయాలు
- పలు ప్రాంతాల్లో సిద్ధమైన మండపాలు



బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు



కరపలోని దుర్గాదేవి అమ్మవారు

బోట్‌క్లబ్: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలను ఆదివారం నుంచి ఈ నెల 24 వరకూ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నగరంలోని ఆలయ కమిటీల ఆధ్వర్యాన అమ్మవార్ల ఆలయాలను ముస్తాబు చేశారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు నిబంధనలకు అనుగుణంగా అమ్మవారి దర్శనాలకు ఏర్పాటు చేస్తున్నారు.

- సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయం ముఖద్వారం వద్ద భక్తులను ఆకట్టుకునేలా భారీ సెట్టింగులు ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారు ప్రతి రోజూ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు దాతల సహకారంతో ప్రసాదాలు పంపిణీ చేయనున్నారు.
- సంతచెరువు మార్కెట్ వద్ద కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు.
- మాధవ నగర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు ఇబ్బంది లేకుండా దర్శనాలు చేసుకునేలా ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ కార్యదర్శి ఎన్‌వీ సాయిబాబా తెలిపారు.
- దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి దేవస్థానంతో పాటు భానుగుడి సెంటర్‌లోని భానులింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవార్లు ప్రతి రోజూ వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లూ చేశామని ఈఓ ఆర్.రాజేశ్వరరావు తెలిపారు.



ఉత్సవాలకు ముస్తాబవుతున్న మాధవనగర్ కనకదుర్గ అమ్మవారి ఆలయం

- భానుగుడి అయ్యప్పస్వామి సన్నిధిలో శరన్నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ పర్సన్ ఇన్‌చార్జ్ గోపాలకృష్ణ తెలిపారు. ప్రతి రోజూ అమ్మవారికి అర్చన, కుంకుమపూజ, చండీహోమం నిర్వహిస్తామన్నారు.
- వేదవిజ్ఞాన ప్రతిష్ఠానంలో శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా పది రోజుల పాటు ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నామని ప్రతినిధి పుసులూరి ఫణిశర్మ తెలిపారు.
- స్థానిక పోర్టు రైల్వే స్టేషన్ సమీపాన రైల్వే కాలనీలోని కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో 38వ శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎంపీ రవికృష్ణ, ధర్మకర్త ఎస్.చిరంజీవిరెడ్డి తెలిపారు. వీటితో పాటు నగరంలో పలు అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

కరప మండలంలో..

కరప: మండలంలోని కరప, అరట్లకట్ట, జెడ్.భావారం, కూరాడ, కొరుపల్లి, నడకుదురు, పెనుగుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, వేళంగి, వాకాడ, వేములవాడ, వలసపాకల తదితర గ్రామాల్లో దేవీ నవరాత్ర ఉత్సవాలు నిర్వహించనున్నారు. అమ్మవార్ల ఆలయాలకు రంగులు వేశారు. చలువ పందిళ్లు వేసి రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. కరప దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రతి రోజూ కుంకుమ పూజలు నిర్వహిస్తున్నామని అర్చకుడు కొంపెల్ల చక్రధరరావు తెలిపారు. దుర్గాదేవి అమ్మవారిని పది రోజుల పాటు రోజుకొక అవతారంలో అలంకరించనున్నారు. బాల, లలిత, గాయత్రి, మహాలక్ష్మి, అన్నపూర్ణ, మహాసరస్వతి, మహాదుర్గ, మహాకాళి, రాజరాజేశ్వరి అవతారాల్లో అమ్మవారిని అలంకరించి, పూజిస్తామని నిర్వాహకులు మేడిశెట్టి పెద్దకాపు, మేడిశెట్టి అప్పలస్వామి, నక్కా సత్యనారాయణ తదితరులు తెలిపారు. కరప పర్వతవర్ధినీ దేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లూ చేశామని ఈఓ వడ్డాది సత్తిబాబు తెలిపారు. అమ్మవారిని విల్లంబులు, ఊయల, పుస్తకపాణి, వీణాపాణి, జపమాల (సింహారోహణ), రక్తబీజాక్షుని వధ, శుంభనిశుంభుల వధ, మహిషాసురమర్దిని, శ్రీపర్వతవర్ధినీదేవి నిజ అవతారాలుగా అలంకరించి, పూజలు చేస్తామని అర్చకుడు విలపర్తి శ్రీనివాస్ తెలిపారు. అమ్మవారి ఆలయాలు లేని గ్రామాల్లో ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేసి, ఆ తల్లిని నిలిపి, దేవీ నవరాత్రులు నిర్వహిస్తున్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవండి

- కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు
- రేపూరులో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ఆశీస్సులు ఇవ్వాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రేపూరులో శనివారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. సర్పంచ్ నక్కా వీరన్న ఆధ్వర్యాన ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కన్నబాబు అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామ సమస్యలు తెలుసుకోవడంతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగున్నరేళ్లుగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా అమలు చేశారని చెప్పారు. మేనిఫెస్టో అంటే గత ప్రభుత్వం మాదిరిగా చెత్త కాగితం కాదని నిరూపించారని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు మామిడాల వీరచక్రం, జెడ్పీటీసీ సభ్యుడు నులుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

గురజనాపల్లిలో డెంగీ కేసు



దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

కరప: గురజనాపల్లికి చెందిన ఒక యువతి జ్వరం రావడంతో చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ డెంగీగా గుర్తించి, ఆమెకు వైద్యం అందిస్తున్నారు. డెంగీ కేసు నమోదైన ఇంటి పరిసరాల్లో పంచాయతీ సిబ్బందితో గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్ర కుమార్ శనివారం దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. వీధులు శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస నాయక్ గురజనాపల్లి వెళ్లి వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లతో ఇంటింటి సర్వే చేసి, జ్వరం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలకు జాగ్రత్తలు వివరించారు. జ్వరం, కీళ్ల నొప్పులతో బాధ పడుతూంటే వెంటనే వైద్యం చేయించుకోవాలని సూచించారు.

నేడు ఘనంగా ప్రతిష్ఠాపన మహోత్సవాలు



కనకదుర్గ అమ్మవారి ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పుష్పాధివాసం

బోట్‌క్లబ్: సినిమా రోడ్డులోని సంతచెరువు వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. దీనికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ నిర్మాణ దాత జొన్నాడ చినబాబు శనివారం తెలిపారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు. ఈ ఆలయాన్ని రూ.2 కోట్లతో నిర్మించామన్నారు. ఆలయ ప్రాంగణంలో గణపతి, కార్తికేయుని విగ్రహాలను నూతనంగా ప్రతిష్ఠిస్తున్నామని చెప్పారు. నూతన ధ్వజస్తంభం, శిఖర దివ్య ప్రతిష్ఠాపన కూడా జరుగుతాయన్నారు. ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం గణపతి పూజ, మండప పూజలు, మూలమంత్ర జపాలు నిర్వహించారు. సాయంత్రం వేదపండితుల ఆధ్వర్యంలో మూర్తి అధివాస కళ, గర్తమండప హోమాలు, పంచశయ్యాధివాసం, చతుర్వేద స్వస్తి, పుష్పాధివాసం, దర్బారు సేవ నిర్వహించారు.

ట్రస్ట్ హాస్పిటల్‌కు టైమ్స్ బిజినెస్ అవార్డు



టైమ్స్ బిజినెస్ అవార్డుతో ట్రస్ట్ ఎండీ కల్యాణ్ చక్రవర్తి, డైరెక్టర్ రామకృష్ణ, వైద్యులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లోని ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు ప్రతిష్టాత్మక టైమ్స్ బిజినెస్ అవార్డు లభించింది. ఆసుపత్రిలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై.కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ, 2023 సంవత్సరానికి రాష్ట్రంలోనే ఉత్తమ వైద్య సేవలకు గాను టైమ్స్ బిజినెస్ అవార్డు లభించిందని చెప్పారు. విజయవాడలో గత నెల 29న జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో అతిథులు శ్రీయా శరణ్, మెహ్రీన్ కౌర్ ఫిర్జాదా చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నామన్నారు.

టైమ్స్ బిజినెస్ అవార్డులు వివిధ రంగాల వారికి అందజేస్తారని, హెల్త్ విభాగానికి సంబంధించి ట్రస్ట్ ఆసుపత్రి ఎంపికవడం తమ బాధ్యతను మరింత పెంచిందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న 200 పడకలను భవిష్యత్తులో విస్తరిస్తామని, అదనపు విభాగాలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఎస్‌సీహెచ్‌ఎస్ రామకృష్ణ మాట్లాడుతూ, తమ ఆస్పత్రిలో అవయవ మార్పిడి విజయవంతంగా జరుగుతోందన్నారు. సమావేశంలో డైరెక్టర్లు వైద్యులు శెనోయ్, శ్రీనివాసమూర్తి, సురేంద్రనాథ్, సోమయాజులు, సాన ప్రవీణ్, నిశాంత్, చంద్రమౌళి, యు.రామకృష్ణ, ఉమ, కిశోర్‌కుమార్, ఫణి రామభూషణ్, స్వాతి, రజని, సందీప్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న కోరమాండల్ మహిళా క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: కోరమాండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యాన రమణయ్యపేటలోని ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు శనివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. క్లబ్ ఉపాధ్యక్షురాలు మల్లీశ్వరి మాట్లాడుతూ, కోరమాండల్ మహిళా క్లబ్ ద్వారా ప్రతి నెలా పేదలు, వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపోయేలా సరకులు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

- కమిషనర్ నాగనరసింహారావు ఆదేశం
- బకాయిలపై అధికారులతో సమీక్ష

కాకినాడ: పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. యూజర్ చార్జీలు, ఆస్తి పన్నులు, నీటి మీటర్ల బకాయిలపై అధికారులతో ఆయన స్మార్ట్ సిటీ కార్యాలయంలో శనివారం సమీక్షించారు. నగరపాలక సంస్థ పరిధిలో నీటి మీటర్ల బకాయిలు రూ.4 కోట్ల వరకూ వసూలు కావాల్సి ఉందన్నారు. బకాయిదారులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, స్పందించని వారి కుళాయి కనెక్షన్లు కట్ చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం 20 కుళాయి కనెక్షన్లు తొలగించామన్నారు. నోటీసులకు స్పందించని వారిపై మరిన్ని కఠిన చర్యలకు సిద్ధం కావాలని స్పష్టం చేశారు. నీటి మీటర్ల బకాయిల వసూళ్ల కోసం నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆస్తి పన్ను రూ.20 కోట్ల వరకూ వసూలు కావలసి ఉందని, దీనిపై కూడా దృష్టి పెట్టాలని అన్నారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణకు వసూలు చేస్తున్న యూజర్ చార్జీలపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి బుధవారం చేసే స్పెషల్ డ్రైవ్ ద్వారా మొదటి వారంలోనే యూజర్ చార్జీలు వసూలయ్యేలా ఆయా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. హూపర్ టిప్పర్ వాహనాల నిర్వహణకు ప్రతి నెలా రూ.56 లక్షల ఖర్చవుతుందని, యూజర్ చార్జీల ద్వారా ఆ సొమ్ము సకాలంలో వసూలు కాకపోతే, సాధారణ నిధుల నుంచి చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. ఇది అభివృద్ధిపై ప్రభావం చూపిస్తుందని పేర్కొన్నారు. సిబ్బందితో పాటు ప్రజలు కూడా సహకరించి, సకాలంలో యూజర్ చార్జీలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు చెక్కా రమణ, ఎంఎస్ నిర్మల, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు, డీఈ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ధూంధాంగా ‘అవ్యాన్’

- ఆర్ఎంసీలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు
- సోదరభావంతో మెలగాలని వక్తల ఆకాంక్ష



ముఖ్య అతిథులతో వైద్య విద్యార్థులు

కాకినాడ క్రైం: అవ్యాన్ పేరిట స్థానిక రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ)లో శనివారం రాత్రి ఫ్రెషర్స్ డే వేడుకలు ధూంధాంగా జరిగాయి. రంగరాయ ఆడిటోరియంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సీనియర్లు, జూనియర్ల మధ్య సోదర భావం పరిఢవిల్లాలని వక్తలు ఆకాంక్షించారు. ర్యాగింగ్‌ను సమాజం అసాంఘిక చర్యగా పరిగణిస్తోందని, చట్ట ప్రకారం బాధ్యులకు శిక్ష తప్పదని చెప్పారు. జూనియర్లకు సీనియర్లు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కళాశాల కీర్తిప్రతిష్ఠలను వివరించారు. దేశ విదేశాల్లో స్థిరపడి, కళాశాల కీర్తిని ఇనుమడింపజేసిన ప్రఖ్యాత వైద్యుల గురించి ప్రస్తావించారు. వారి స్ఫూర్తితో దేశానికి, ప్రాంతానికి, కళాశాలకు ప్రతిష్ఠ తీసుకురావాలని కోరారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా సీనియర్లు నృత్య రూపకాలు, ప్రదర్శనలతో జూనియర్లకు ఘన స్వాగతం పలికారు. పలువురు సీనియర్ విద్యార్థులు మాట్లాడుతూ, సోదర భావంతో మెలుగుతామని, కొత్తగా చేరిన వారికి అండగా ఉంటామని చెప్పడంతో హాలు చప్పట్లతో మార్మోగింది. అనంతరం బోధకుల పరిచయం జరిగింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులు, సీనియర్ బోధకులు నృత్యాలతో అవ్యాన్‌కు కొత్త కాంతులద్దారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ వేడుకల్లో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీ మాధవి, కల్చరల్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శైలజ, స్పోర్ట్స్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, క్యాంపస్ ఆఫీసర్ డాక్టర్ సతీష్, కళాశాలకు చెందిన వివిధ విభాగాల ప్రతినిధులు, 750 మంది సీనియర్, 249 మంది జూనియర్ విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి మీటర్ల బకాయిలపై కొరడా




నీటిమీటర్ల బకాయిల నేపథ్యంలో కుళాయి కనెక్షన్లు తొలగిస్తున్న సిబ్బంది



రూ.1.88 కోట్ల బకాయిని డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్‌కు అందజేస్తున్న యాంకరేజ్ పోర్టు అధికారులు

- పన్నులు కట్టనివారి కుళాయి కనెక్షన్లు కట్
- స్పందించకపోతే మరిన్ని కఠిన చర్యలు
- నేటి నుంచి కాకినాడలో స్పెషల్ డ్రైవ్
- నగరపాలక సంస్థ సన్నాహాలు

చెల్లించకపోతే చర్యలు



నీటి మీటర్ల బకాయిలు తక్షణమే చెల్లించాలి. లేకుంటే కుళాయి కనెక్షన్లు తొలగించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటాం. సకాలంలో పన్నులు చెల్లించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. పారిశుధ్యం, మంచినీరు, వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు బకాయిల భారం అవరోధంగా ఉంటోంది. అందువల్ల బకాయిదారులు నగరపాలక సంస్థకు సకాలంలో పన్నులు చెల్లించి, సహకరించాలి.

– సీహెచ్ నాగనరసింహారావు, కమిషనర్, నగరపాలక సంస్థ

కాకినాడ: నీటి బకాయిలపై కాకినాడ నగరపాలక సంస్థ కొరడా ఝుళిపిస్తోంది. బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలకు సంబంధించి నీటి మీటర్లు అమర్చి వినియోగం ఆధారంగా పన్నులు విధిస్తున్నారు. నగరంలో ఈ తరహా అసెస్‌మెంట్లు సుమారు 2,300 ఉన్నాయి. వీరి ద్వారా ప్రస్తుత, పాత బకాయిలు కలిపి రూ.4 కోట్ల వరకూ పేరుకుపోయాయి. నీటిని వాణిజ్యపరంగా వినియోగిస్తున్న సంస్థలు సైతం నీటి మీటర్ల బకాయి చెల్లింపులో అలసత్వం ప్రదర్శిస్తున్నాయి. దీనిపై నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఇతర అధికారులు బకాయిల వసూళ్లపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. మొత్తం రూ.4 కోట్ల బకాయిలు రాబట్టే దిశగా కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇందులో భాగంగా బకాయిదారులకు కొద్ది రోజుల క్రితం నోటీసులు కూడా ఇచ్చారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో గడచిన వారం రోజుల్లో సుమారు 20 మంది కుళాయి కనెక్షన్లు తొలగించారు. బకాయిల వసూళ్లకు ఏఈలు, సచివాలయ అడ్మిన్లు, ఎమినిటీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ప్రతి బకాయిదారు వద్దకు బృందంగా వెళ్లి పన్ను బకాయిని వివరించడంతో పాటు సకాలంలో చెల్లించకపోవడం వలన ఎదురవుతున్న ఇబ్బందులను వివరించాలని సూచించారు. బకాయిలు వసూలు చేయాలని, స్పందించకపోతే ఏమాత్రం ఉపేక్షించవద్దని ఆదేశించారు.

పోర్టు బకాయికి మోక్షం

కాకినాడ యాంకరేజ్ పోర్టు ద్వారా 2017 నుంచి సుమారు రూ.1.88 కోట్ల మేర నీటి పన్ను బకాయి పేరుకుపోయింది. కార్పొరేషన్ యంత్రాంగం ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టడంతో ఆ మొత్తం బకాయిని ఏపీ మారిటైమ్ బోర్డు విడుదల చేసింది. ఇదే తరహాలో మిగిలిన బకాయిలే కూడా వసూలు చేసే విధంగా కింది స్థాయి సిబ్బందికి అధికారులు దిశానిర్దేశం చేస్తున్నారు.